అని అడుగుతున్నాను. ఇంక మహానాయకులకి కూడా స్వార్థపరత్వం పోయిందిగాదు మాడండి. అహా! ఉన్నమాట చెబుతున్నాను. తీసుకెడితే కూతుర్ని అల్లుణ్ణీకూడా తీసుకెళ్లాలి. లేకపోతే కూతుర్నికూడా వదిలెయ్యాలి. ఇంకొక్క టికట్టుకోసం అల్లుణ్ణి అంత నిరసనగా చూడటమా?

నేను ఏ రాజకీయనాయకుడికీ, నాయకురాలికీ అల్లుణ్ణి కాలేదుగాని, లేకపోతే యిటువంటి అన్యాయం జరుగుతుంటే ఊరుకుంటానా? "మహానాయకుల అల్లుళ్ల సంఘం" అని ఒకదాన్ని లేవదీసి దానికి నేనే నాయకుడినై ప్రపంచమంతా సంఘం సొమ్ముతో పర్యటించి, ఆ పర్యటనలో అవశ్యపూర్వకంగా నా కూతురూ (లేకపోతే దత్తత చేసుకుని) అల్లుణ్ణీ నాతో తిప్పుకునేవాణ్ణి. ఎందుకూ యిప్పుడేమనుకుంటే ఏం లాభం, ఆ అవకాశం జారిపోయింది. ఆ విధంగా కాలక్షేపం చేసే రాత నాకు లేకపోయింది. ఆ రాత వున్న రాజకీయనాయకుల అల్లుళ్ళు మరి వూరుకున్నారు, మరమేం చేస్తాం

# దేవతావస్త్రాల మాట!

అంగర వెంకట కృష్ణారావు

చీమ కూతురుకు మొన్న జబ్బు చేసింది. తిండి మానివేసి గుక్కపెట్టి ఏడుస్తోంది. ఏం సాధనం అని దానితల్లి బెంగపెట్టుకొని మొగుడితో చెప్పింది. మొగుడుమాత్రం ఏం చేస్తాడు!

రోజూ తమ పుట్టదగ్గరకు వచ్చే బ్రాహ్మడు రెండు నెలలుపైబడి రావడంలేదు చనిపోయి వుంటాడనుకొంది. అలా చెబితే వింటుందా కూతురు, మరీ ఏడుస్తుంది, ఎందుకింత వేగం చనిపోయేడని. చూద్దాం చూద్దాం మరి రెండు రోజులపాటు అని సముదాయించింది మొగుడు చీమ పెళ్లాం చీమని.

రెండు రోజులు వచ్చిపోయేయి. కాని బ్రాహ్మడు రాలేదు. చీమ కూతురు చిక్కి శల్యమైపోతూంది. వడ్లగింజలు, పప్పులున్నాయి. తినమంటే 'ఊహూ' అంటుంది. పుట్టపక్కనే ఎత్తుగా పెరిగిన చెరుకు తోటలలోంచి, పైరు మంచి మజా అయిన గాలి వీస్తూంది, ఆగాలిలోయి ఆనుకో అంటే కాళ్లు దణాయించి కళ్లు నులుపుకొని ఏడుస్తుంది

ఆడుచీమ కళ్ళంట నీరు రాలుస్తూ, 'ఖర్మండీ. ఇలా ఐతే యెలాగ? ఏదో మార్గం చూడండి! స్వతంత్ర దేశంలో మన పిల్లలు తిండిలేక చిక్కిపోవడం విడ్డూరంగా వుంది. వెళ్లి ఆ బ్రాహ్మడేమనాడో చూడండి. లేకపోతే పిల్ల నిష్కారణంగా...' అని కళ్లు ఒత్తుకుంది

మగచీమ సమాధానంగా తల వూపింది. ఆ వూపు తనకే సమాధానంగా లేదని తనకి తెలుసు.

రెండు రోజులు పోయేక ఆ బ్రాహ్మడు నెమ్మదిగా వచ్చి చీమలపుట్టపై ఒరిగి చూసి విచారించేడు. వెనక్కి తిరిగి యింటివేపు నడవనారంభించేడు. చీమదంపతులు వెంటనే యెలాగో కూతుర్ని నిద్రపుచ్చి అతన్ని వెంబడించేయి.

అతను యింట్లోకి వెళ్ళి కుర్చీలో కూలబడ్డాడు. అతడి కుర్చీకి వెనకవైపు గోడని ఆనుకుని నిలబడ్డాయి చీమ దంపతులు. అతడికి హోమియో వైద్యం తెలుసు. మందుల పెట్టె తెరిచి 'పెద్దా' అని పిలిచేడు. 'పెద్ద' వచ్చేడు.

'ఎలాగుందిరా నీ కండరాల పీకు?'

'తగ్గలేదండీ నాన్నారూ'

'ఇందా- యిది మింగు'

తిరిగి 'చిన్నా' అని పిలిచేడు. 'చిన్న' వచ్చేడు

'నీ కళ్ళమంటలు కడుపులో బాధ యెలా వున్నాయి?'

'ఎక్కువై పోయేయండీ'

'ఇందా యిది మింగు'

ఈ వైద్యానికి చీమదంపతులు ముసిముసి నవ్వులు నవ్వుకున్నాయి.

'అమ్మాయికి వంట్లో బాగులేదండీ' అంటూ వచ్చింది యింటావిడ పిల్లనెత్తుకొని. చీమ దంప

తులు ఆశ్చర్యపోయి, వీళ్ళ యిల్లొక ఆస్పత్రిలా వుంది బాబో అనుకుని.

'పాలు తాగడం లేదు- ఎక్కడకని కొంటాం గ్లాక్సోజు. తిండికే 'త్రాహి త్రాహి' అనిపిస్తూంటే. అయినా వీళ్ల మొహాలు మండా వీళ్ళకి దేశాన్ని పాలించడం రాదండీ. ఇంత కరువా?'

'సరేలే నీ లెక్చరు వినేవాడు లేడు యీ కర్మభూమిలో-ఏకీ యీ మాత్ర దానిచేత చప్పరింపించు.'

'ఏమండోయ్! నాకుకూడా నాలుగుమాత్రలు పడేయండి.'

'అదేమిటే! నీకేం?'

'అదేమో రెణ్ణాళ్లనుంచీ విరేచనం అయేట్టుండడం, వెడితే రాకపోవడం.'

'దీనికంతా 'అదే' కారణం. 'అది' యింకా మన స్టోరులోకి రాలేదట.'

చీమ దంపతులు గబగబ గుమ్మం దిగిపోయి. తోవలో ఆడుచీమ ప్రశ్న వేసింది.

'ఏమండీ-'అది' యేమయిందండీ.'

'ఏం తెలుసు?'

'స్టోరులలో లేక, బజారులలో లేక, ప్యాక్టరీలలో లేక-మాయమైపోయిందా!'

'అదే అయివుండాలి!'

'దేశానికి స్వతంత్రం రాకముందు 'అది' మనకికూడా కావలసినంత దొరికేది, అప్పుడే బావుంది.'

'అలా అనకూడదు. ఇప్పుడు మనం స్వతంత్ర వాయువు పీలుస్తున్నాం.'

'వాయువే పీలుస్తున్నాం! ఆ బ్రాహ్మడి యింట్లో అంతా బాధపడుతున్నారు. 'అది' లేకపోవడంవల్ల, ఇలాంటి విషయం దేశాన్ని పాలిస్తూన్న వాళ్లకి తెలీదూ? వాళ్లు 'అది' రోజూ ముమ్మరంగా వాడుకుంటూంటే వాళ్ల నాలిక ముక్కలై క్రింద పడిపోదూ?' అంటూనే పుట్ట ప్రవేశించారు. ఘొల్లుమని యేడ్చింది ఆడుచీమ కూతురు శవంమీద పడి.

రాక్షసుల పాదాలక్రింద మనుష్యులే పడి ఎముకలు కూడా విరిగి మరణిస్తూంటే చీమలం మనమెంత అని వస్తూన్న దుఃఖాన్ని కంఠం దగ్గరే ఆపి పట్టింది మగచీమ.

చీమలు మొదలు మనుష్యులవరకూ అందర్నీ యీరోజుల్లో బాధిస్తూన్న 'అది' ఏమిటో మీకూ తెలుసు నాకూ తెలుసు, వాళ్లొక్కళ్లకే తెలియదు!

# ఏవీ?

చీకటిలో సాగలేను
ఆకటితో వేగలేను

ఏవీ తూరుపు రేకలు!
ఏవీ మారుపు వాకలు!

వలపు లేక పలుకలేను.
పిలుపు లేక ఒలుకలేను.

ఏవీ పువ్వుల నవ్వులు!
ఏవీ భావపు రువ్వులు!

పాట నోట పాడలేను.
ఆట కూడ నాడలేను.

ఏవీ హృదయస్పందన
లేవీ ఉదయానందము! (లు)

ఏడ్చువారి జూడలేను.
మాడ్చువారి కూడలేను.

ఏవీ కరుణా వీణలు!
ఏవీ తరుణీ వేణులు!

అస్వతంత్ర మోర్వలేను
పస్వరాల నార్వలేను

ఏవీ ప్రజల నినాదము
లేవీ సృజన వివాదము!? (లు)

—బెల్లంకొండ చంద్రమౌళిశాస్త్రి